ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక


Bullet Edition

శుక్రవారం 25 ఏప్రిల్ 2025 www.prajaaswaramdaily.com 2 pm

# బాలానగర్ ఎస్సైపై సస్పెన్షన్ వేటు

## అవినీతి ఆరోపణలతో సస్పెండ్

బాలానగర్ : హైదరాబాద్ బాలానగర్ ఎస్సై సస్పెన్షన్ వేటు పడింది. అవినీతి ఆరోపణలతో ఆయన్ను సస్పెండ్ చేస్తూ హైదరాబాద్ సీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఓ మహిళ కేసు విషయంలో ముగ్గురిని ఎస్సై లక్ష్మీనారాయణ అకారణంగా కొట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ కమిషన్‌లో బాధితుల ఫిర్యాదు చేశారు. దీంతో హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ (సీపీ) ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.



# లష్కరే తోయిబా టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లీ హతం

కశ్మీర్ : జమ్మూకాశ్మీర్ లో ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య శుక్రవారం ఉదయం నుంచి ఎన్‌కౌంటర్ కొనసాగుతోందని సైన్యం తెలిపింది. బందిపొరాలో ఉగ్రవాదుల కదలికలకు సంబంధించి పక్కా సమాచారంతో భద్రతా దళాలు ఆ ప్రాంతానికి చేరుకున్నాయని పేర్కొంది. నిఘా వర్గాల సమాచారంతో బందిపొరాలో తనిఖీలు నిర్వహిస్తుండగా ముష్కరులు కాల్పులకు దిగారని, భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరపడంతో లష్కరే తోయిబా టాప్ కమాండర్ అల్తాఫ్ లల్లి చనిపోయాడని అధికార వర్గాల సమాచారం. అయితే, ఈ విషయంపై ఆర్మీ అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది.



# హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానం ఎంఐఎందే

హైదరాబాద్ : హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థి మీర్జా రియాజ్ ఉల్ హసన్ ఎఫెండీ విజయం సాధించారు. ఆయనకు 63 ఓట్లు రాగా... బీజేపీ అభ్యర్థి గౌతమ్ రావుకు 25 ఓట్లు వచ్చాయి. దీంతో 38 ఓట్ల తేడాతో మీర్జా హసన్ గెలుపొంది. హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానం ఎంఐఎం కైవసం చేసుకుంది.

ఇక, హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి 22 ఏళ్ల తర్వాత ఎన్నిక జరిగింది. బీజేపీ అనూహ్యంగా అభ్యర్థిని బరిలోకి దింపడంతో ఈ ఎన్నిక చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 23న ఎన్నిక జరిగింది. ఇక్కడ మొత్తం 112 మంది ఓటర్లు ఉన్నారు. అత్యధిక ఓట్లు ఎంఐఎంకు ఉండగా... ఆ తర్వాతి స్థానంలో బీజేపీ ఉంది. ఎంఐఎంకు 49 ఓట్లు ఉండగా... ఇతర పార్టీల మద్దతు లభించింది.



# బీఆర్ఎస్ గుర్తింపు రద్దుపై ఫిర్యాదు?



## బీజేపీ అభ్యర్థి గౌతమ్ రావు స్పష్టీకరణ

## ఎంఐఎంకు కాంగ్రెస్ సహకారం

హైదరాబాద్: హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసిన గౌతమ్ రావు ఓటమి అనంతరం తీవ్ర స్థాయిలో స్పందించారు. ఈ ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ తన కార్పొరేటర్లను ఓటు వేయకుండా అడ్డుకుందని ఆరోపిస్తూ, ఎలక్షన్ కమిషన్ ముందు ఈ విషయాన్ని ఉంచనున్నట్లు తెలిపారు. "ఓటు వేయొద్దని మీ పార్టీ నేతలే చెబితే, మీరు రేపు ప్రజలను ఓటు వేయమని ఎలా అడుగుతారు?" అని ప్రశ్నించారు గౌతమ్ రావు. అలాగే, ఎంఐఎం పార్టీ చేతుల్లో కాంగ్రెస్ పనిచేస్తోందని, ఈ ఎన్నికల ఫలితంతో ఎంఐఎం, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఒకటేనని స్పష్టమైందని ఆరోపించారు. తెలంగాణ ప్రజలు ఈ రహస్య ఐక్యతను గుర్తించాలి అని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ గుర్తింపును రద్దు చేయాలంటూ ఎన్నికల కమిషన్‌కి ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎంఐఎం అభ్యర్థి మీర్జా రియాజ్‌ఉల్ హసన్ 63 ఓట్లతో గెలిచారు. కాగా గౌతమ్ రావు 25 ఓట్లు మాత్రమే పొందారు. బీఆర్ఎస్ పార్టీ ఓటింగ్‌కు దూరంగా ఉండటంతో, ఈ ఎన్నికలు హాట్‌టాపిక్‌గా మారాయి.

# సీఎం రేవంత్ రెడ్డికి బిగ్ రిలీఫ్



## నిరాధార ఆరోపణల కేసు

## హైకోర్టులో విచారణ

## జూన్ 12కు వాయిదా

హైదరాబాద్: కొత్తగూడెం సభలో జరిగిన బహిరంగ సభలో నిరాధార ఆరోపణలు చేశారని రేవంత్ రెడ్డిపై క్రిమినల్ పిటిషన్ వేసినకేసులో నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి ఆయనకు మినహాయింపు ఇస్తున్నట్లు హైకోర్టు తెలిపింది. అయితే, ప్రజాప్రతినిధుల కోర్టు విచారిస్తున్న కేసుపై మాత్రం స్టేకు నిరాకరించింది.

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసును కొట్టేయాలని ఆయన పిటిషన్ దాఖలు చేశారు. రాజకీయ ప్రసంగాలకు పరువు నష్టం ఉండదని అందులో పేర్కొన్నారు. ఈ మేరకు పలు సుప్రీంకోర్టు తీర్పులను రేవంత్‌రెడ్డి పిటిషన్‌లో ప్రస్తావించారు. దీనిపై వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. తదుపరి విచారణను జూన్ 12వ తేదీకి వాయిదా వేసింది.

గతేడాది కొత్తగూడెం సభలో జరిగిన బహిరంగ సభలో నిరాధార ఆరోపణలు చేశారని రేవంత్ రెడ్డిపై బీజేపీ క్రిమినల్ పిటిషన్ దాఖలు చేసింది. బీజేపీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తారని ఆయన ఆరోపించారని అందులో పేర్కొంది. దీంతో బీజేపీ పరువుకు నష్టం కలిగిందని పిటిషనర్ కాసం వెంకటేశ్వర్లు తెలిపారు. ఇప్పటికే దీనిపై నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టు విచారణ చేపట్టింది. రేవంత్‌రెడ్డి ప్రసంగించిన ఆడియో, వీడియో సాక్ష్యాలను పిటిషనర్ కోర్టుకు సమర్పించారు. కాసం వెంకటేశ్వర్లు వాంగ్మూలాన్ని ప్రజాప్రతినిధుల కోర్టు నమోదు చేసింది. ఈక్రమంలో ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణలో ఉన్న కేసును కొట్టేయాలని రేవంత్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.

# 7.5 లక్షల కోట్ల సంపద ఆవిరి

## భారీ నష్టాల్లో స్టాక్ మార్కెట్లు

## భారత్ -పాక్ మధ్య ఉద్రిక్తతలే కారణం

ముంబయి: దేశీయ మార్కెట్ సూచీలు శుక్రవారం భారీ నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు ఉన్నప్పటికీ.. దేశీయంగా బ్యాంకింగ్ షేర్లలో కొనుగోళ్లు సూచీలను పడేశాయి. దీనికి తోడు పహల్గాం ఉగ్రదాడితో భారత్-పాక్ మధ్య నెలకొన్న ఉద్రిక్తతలు మార్కెట్లపై ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయి. దీంతో సెన్సెక్స్ ఏకంగా 950 పాయింట్లకు పైగా పతనమవ్వగా.. నిఫ్టీ 24వేల మార్క్‌ను కోల్పోయింది. బీఎస్‌ఈలో మదుపర్ల సంపదగా భావించే నమోదిత కంపెనీల మార్కెట్ విలువలో రూ.7.5లక్షల కోట్ల మేర ఆవిరైంది.

ఈరోజు ట్రేడింగ్‌ను సూచీలు సానుకూలంగానే ప్రారంభించినప్పటికీ.. కాసేపటికే అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. ఉదయం 11 గంటల సమయంలో సెన్సెక్స్ 952.7 పాయింట్లు కుంగి 78,850.71 వద్ద ట్రేడ్ అవుతోంది. అటు నిఫ్టీ 324.7 పాయింట్లు దిగజారి 23,922.05 వద్ద కొనసాగుతోంది. బ్యాంక్ నిఫ్టీ 1.56శాతం మేర నష్టాల్లో ఉంది. ప్రధాన బ్యాంకులైన ఎస్‌బీఐ షేర్లు 2.71శాతం, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ షేర్లు 0.62శాతం, ఐసీఐసీఐ షేర్లు 0.42శాతం మేర కుంగాయి.

మరోవైపు, ఆసియా పసిఫిక్ మార్కెట్లు శుక్రవారం లాభాల్లో ఉన్నాయి. జపాన్ నిక్కీ 0.91శాతం, దక్షిణ కొరియా కోస్పి 1.03శాతం, హాంకాంగ్ హాంగ్‌సెంగ్ సూచీ 0.75శాతం లాభంతో ట్రేడ్ అవుతున్నాయి. వాల్‌స్ట్రీట్ మార్కెట్లు వరుసగా మూడో రోజు రాణించాయి.



# పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యం

## శాంతిని నెలకొల్పడం.. అహింసను ప్రోత్సహించడం కూడా..

## భారత్ సమ్మిట్ 2025 ప్రారంభం

## వందకు పైగా దేశాల ప్రతినిధులతో హెచ్ఐసీసీ వేదికగా సమావేశం

## తెలంగాణ సంక్షేమ పథకాలను ఆవిష్కరించిన ప్రభుత్వం

## సదస్సుకు రానున్న ఏఐసీసీ అగ్రనేతలు ఖర్గే, రాహుల్ , ప్రియాంక గాంధీ

హైదరాబాద్ : పెట్టుబడులు, న్యాయం, ప్రపంచ శాంతి, అహింస అనే మహత్తర లక్ష్యాలతో ప్రతిష్టాత్మక భారత్ సమ్మిట్ – 2025 శుక్రవారం హైదరాబాద్‌లో ఘనంగా ప్రారంభమైంది. నగరంలోని హైటెక్స్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ), నోవాటెల్‌లో రెండు రోజుల పాటు ఈ సమ్మిట్ జరగనుంది. ఈ అంతర్జాతీయ సదస్సుకు 100కు పైగా దేశాల నుంచి 450 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు. భారత్ సమ్మిట్‌కు విచ్చేసిన వివిధ దేశాల ప్రతినిధులకు తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా అపూర్వ స్వాగతం లభించింది. కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నాయకులు సాంప్రదాయబద్ధమైన బోనాలు, డప్పు చప్పుళ్లతో వారిని సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను తెలియజేసే ప్రత్యేక స్టాల్‌ను ఏర్పాటు చేశారు. ఈ స్టాల్ సందర్శకులకు రాష్ట్ర ప్రభుత్వ విధానాలు, కార్యక్రమాలపై సమగ్ర అవగాహన కల్పించనుంది.

ఈ అత్యంత ముఖ్యమైన సమ్మిట్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొననున్నారు. అంతే కాకుండా, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ)కి చెందిన అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్ వంటి ప్రముఖులు కూడా ఈ సదస్సులో పాల్గొని తమ విలువైన అభిప్రాయాలను పంచుకోనున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను ఆకర్షించడం, అంతర్జాతీయ స్థాయిలో న్యాయం, శాంతిని నెలకొల్పడం, అహింసా మార్గాన్ని ప్రోత్సహించడం ఈ సమ్మిట్ యొక్క ప్రధాన ఉద్దేశాలు. రానున్న రెండు రోజుల్లో వివిధ దేశాల ప్రతినిధులు పెట్టుబడుల అవకాశాలు, అంతర్జాతీయ సంబంధాలు, శాంతి స్థాపన వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చలు జరపనున్నారు. ఈ సమ్మిట్ ప్రపంచ వేదికపై భారతదేశ ప్రాముఖ్యతను మరింతగా చాటిచెబుతుందని భావిస్తున్నారు.

